క్లుప్తంగా

నేటి నుంచి ఆరు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా స్థానిక పామర్రు రోడ్డులో విద్యుత్ స్తంభాల తొలగింపు కారణంగా ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు ఆరు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ టి.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భీమవరం గేటు నుంచి బందరు గేటు వరకు, లక్ష్మీనగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ, చౌదరిపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వీరాంజనేయుడికి ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు సమీపంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆంజనేయుడిని దర్శించుకున్నారు. తొలుత ఆలయంలో స్వామివారికి అభిషేకాలు చేసి శత సహస్ర నామాలతో వడ మాలలు, నాగవల్లిలతో విశేషంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పాలపొంగళ్లను వండి స్వామికి నివేదించారు. వాహన పూజలు జరిగాయి. ఆలయంలో పూజా కార్యక్రమాలను అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యాన నిర్వహించామని ఈఓ ఎల్.సత్యవతి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మట్టా పూర్ణచంద్రరరావు, కమిటీ సభ్యులు ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

చింతా రవిబాలకృష్ణకు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం



కూచిపూడి(మొవ్వ): వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం అందించే కీర్తి పురస్కారానికి కూచిపూడిలోని నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ ఎంపికయ్యారు. సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ అవార్డును త్వరలో అందజేయనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేష్ ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రవి బాలకృష్ణను కళాపీఠం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

వ్యవసాయ సింహావలోకనం పుస్తకావిష్కరణ

మొవ్వ: మొవ్వ క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో మంగళవారం ఆ కళాశాల పూర్వ విద్యార్థి సి.సురేష్ రచించిన వ్యవసాయ పరిచయం–వ్యవసాయ సింహావలోకనం పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రచయిత సురేష్‌లోని పట్టుదల, ఏకాగ్రత, ప్రతిభను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. 2015–17లో తమ కళాశాలలో బీపీసీ పూర్తి చేసిన సురేష్ 2023 ఐసీఏఆర్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఆల్ ఇండియా ఫస్ట్ ప్లేస్ సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హెచ్ మాధవీలత, కె.రంగనాయకులు, మహేష్, శ్రీనివాసరావు గ్రంథాలయ అధికారి ఏవీ సర్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యాన 120 మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. తొలుత స్వామివారి పుట్టలో పాలుపోసి పాల పొంగళ్ల శాల వద్ద నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

కైకలూరు: విద్యార్థి దశ నుంచి చట్టాలపై కనీస అవగాహన అవసరమని పలువురు న్యాయవాదులు చెప్పారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కైకలూరు ఓరియంటల్ స్కూల్ విద్యార్థులకు న్యాయవాదులు డి.శివప్రసాద్, సీహెచ్ శంకరశాస్త్రి, రమాదేవి చట్టాల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, మహిళా సంరక్షణ పోలీసు కె.స్వరూప, పారలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పెడన: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పెడన ఎంఈఓ–1 ఎంవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన దక్షిణ తెలుగుపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో చదవించడం, వారితో బోధన బోర్డుపై రాయించడం వంటివి చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు విద్యార్థులు వెనుకబడి ఉండటాన్ని గమనించి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. రాగి జావ రుచికరంగా ఉందని ప్రశంసించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- గుడివాడ మండలంలో 19 వేల ఎకరాల్లో వరిసాగు
- పంట నమోదుతో ఉపయోగం
- మండలంలో నాలుగేళ్లలో 26.42 కోట్ల లబ్ధి



గుడివాడలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

గుడివాడరూరల్: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. దీనిలో భాగంగా పంట నమోదుతో రైతులకు లబ్ధి కలుగుతోంది. ఈ క్రాప్ అమలు చేయడంతో.. పంట నష్టమే కాకుండా, రైతుభరోసా, ఎరువులు, సామగ్రి, పురుగు మందులు కూడా నాలుగేళ్లుగా రైతులకు అందుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం మాదిరి పంటల సాగు నమోదులో కాకి లెక్కలకు కాలం చెల్లింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచినేటి వరకు రైతాంగానికి మేలు చేకూరుస్తున్నారు. గుడివాడ మండలంలో సుమారు 19వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. నాలుగేళ్లుగా రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులు ఉమ్మడిగా గ్రామాల్లో పంటలను స్వయంగా పరిశీలించి పంటల నమోదు వివరాలు నమోదు చేస్తున్నారు. గతంలో ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ఎలాంటి పంటల సాగు చేస్తున్నారో కచ్చితంగా లెక్కించడం కష్టతరంగా ఉండేది. ప్రభుత్వ రాయితీలను కొంతమంది బోగస్ రైతులు తన్నుకుపోయేవారు. పంటల సాగు చేసిన నిజమైన రైతాంగం పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగేవారు.

పక్కాగా లెక్క

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పంటల సాగు లెక్కలు పక్కాగా గుర్తించడానికి ప్రభుత్వం ఈ–అగ్రికల్చర్ యాప్‌ను రూపొందించడంతో గత నాలుగేళ్ల నుంచి పంట నష్టపోయిన రైతులను గుర్తిస్తోంది. క్షేత్రస్థాయిలో ఏ పంట వేస్తే ఆ పొలంలోనే రైతును నిలిపి ఫొటోతో సహా వివరాల నమోదుకు వ్యవసాయశాఖ శ్రీకారం చుట్టింది.

ఈ ప్రక్రియ అక్టోబర్ వరకు నిర్వహిస్తామని, దీన్ని వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మండలంలో 12,500 మంది రైతులు ఉన్నారు. వీరిలో 4500 మందికి రైతుభరోసా అందుతోంది. నాలుగేళ్లలో 26.42 కోట్ల లబ్ధి పొందారు.

ఈ క్రాప్ నమోదు చేయాలి

ప్రభుత్వం మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి పంట కొనుగోలు చేస్తుంది. కొనుగోలు సమయానికి రైతులు పంట సాగు ఈక్రాప్‌లో నమోదు చేయాలి. అప్పుడే పంటల బీమా, పెట్టుబడి రాయితీ, వైఎస్సార్ రైతుభరోసా, సబ్సిడీ ఎరువులు, పురుగు మందుల పంపిణీ అర్హులైన ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వం నుంచి సక్రమంగా అందుతాయి. ఆయా సర్వే నంబర్ల పరిధిలోని పంటల వివరాలను ట్యాబ్‌ల్లో చిత్రీకరించి జీపీఎస్ ద్వారా సర్వర్‌కు పంపుతారు.

ఈ క్రాప్‌తో మేలు

నాలుగేళ్ల నుంచి ఈ క్రాప్‌లో తాను సాగు చేసిన పంటను వ్యవసాయశాఖ అధికారులు నమోదు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో తమలాంటి కౌలురైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారాలు సక్రమంగా అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈక్రాప్‌ను ప్రవేశపెట్టి పంటల నమోదు చేయడంతో ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుభరోసా, ఎరువులు, పురుగు మందులు సక్రమంగా అందుతున్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతున్న సమయంలో పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందని ఆశిస్తున్నా.

–కైలే అశోక్, కౌలు రైతు తటివర్రు

కచ్చితమైన సమాచారం

ఈ క్రాప్ నమోదు ద్వారా పంటల సాగుకు సంబంధించి కచ్చితమైన సమాచారం అందుతుంది. ఇలా నమోదు చేస్తే పంట ప్రారంభంలోనే రైతులకు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ప్రభుత్వం నుంచి సాయం అందుతుంది. వ్యవసాయశాఖ పరంగా రైతులకు అందే రాయితీలకు ఈ పంటనే ప్రామాణికంగా తీసుకుంటాం. రైతులు తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలి.

–బి.అనంతలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి

సర్కారు కాల్వ ఇనుప వంతెనకు మరమ్మతులు



సర్కారు కాల్వ ఇనుప వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: సర్కారు కాలువపై ప్రస్తుతం ప్రభుత్వం నిర్మించిన వారధి నిర్మాణానికి తోడు సమీపంలోని పాత ఇనుప వంతెనకు మరమ్మతులు చేసి వినియోగంలో రావడానికి స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తానని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఆ వంతెనను మంగళవారం ఎమ్మెల్సీ జయమంగళవెంకటరమణ పరిశీలించారు. పాత వంతెనను తొలగించకుండా వన్‌వే గా ఉపయోగించాలని కొల్లేరు ప్రజలు కోరుతున్నారని ఎమ్మెల్సీ తెలిపారు. పెద్దింట్లమ్మ జాతర సమయంలో రెండు వంతెనలు ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడదన్నారు. అనంతరం శృంగవరప్పాడులో సైదు గంగరాజు శత జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కొల్లేరు నాయకులు బలే సముద్రుడు, ఘంటసాల జగన్నాథం, ఎంపీటీసీ బలే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

29న అరుణాచలానికి బస్ సర్వీస్

గుడివాడ టౌన్: అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం గుడివాడ ఆర్టీసీ డిపో సూపర్‌లగ్జరీ బస్ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ రాత్రి 8 గంటలకు గుడివాడ నుంచి బయలుదేరి 30వ తేదీ ఉదయం 5 గంటలకు శ్రీకాళహస్తి చేరుకుని మధ్యాహ్నం 2 గంటకు కాణిపాకం, రాత్రికి గోల్డెన్‌టెంపుల్ చేరుకుంటుందని వివరించారు. 31వ తేదీ అరుణాచలం గిరి ప్రదక్షిణలు పూర్తిచేసుకుని బయలుదేరిన బస్సు 1వ తేదీ ఉదయం గుడివాడకు చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర రూ.3 వేలు అని పేర్కొన్నారు. వివరాలకు 7382903299, 9177101904 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆపదలో ఆదుకున్న వ్యక్తికి సన్మానం



అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సేవాసంస్థ సభ్యులు

గుడివాడ టౌన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ గుడివాడ శాఖ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి ఆధ్వర్యాన జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో ఇటీవల బొమ్ములూరు రోడ్‌లో యాక్సిడెంట్‌లో గాయపడిన వ్యక్తి బీవీవీఎస్ వర ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులు వచ్చే వరకు పర్యవేక్షణ చేసిన అజయ్‌కుమార్‌ను సత్కరించి రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న బి.వెంకటేశ్వరరావుకు రూ 5 వేలు వితరణ అందజేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పీవీ శేషగిరిరావు, గుత్తా రమేష్, ఉప్పలపాటి మారుతీప్రసాద్, దండమూడి సీతారామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు



కేక్ కోస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలనుకునే వారు మెగాస్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ఫర్నేచర్ పార్కు వద్ద మంగళవారం సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొడాలి నాని కేక్ కోసి అభిమానులకు పంచారు. నిబద్ధత, పట్టుదల, దీక్ష కలిగిన నటుడు చిరంజీవి అని కొనియాడారు. కార్యక్రమంలో పాలేటి శివ సుబ్రహ్మణ్యం(చంటి), అద్దేపల్లి పురుషోత్తం, తోట సాయి, పంచకర్ల వెంకట్, ఆంజనేయ ప్రసాదు, తోట శివాజీ, లోయ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ చేస్తున్న మానవత సభ్యులు

పామర్రు: సమాజం శాంతియుతంగా ఉండాలి అంటే ప్రజల్లో సమతాభావం పెరగాలని దీనికి మానవత సేవాసంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పామర్రు ఎస్ఐ పీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మానవత సేవాసంస్థ పామర్రు శాఖ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో శాంతి ర్యాలీ జరిగింది. ప్రపంచ శాంతిని కోరుతూ స్థానిక ప్రతాప్ కాలేజీ నుంచి విద్యార్థులు, మానవత సభ్యులు శాంతియుత ర్యాలీని అంకమ్మ తల్లి ఆలయం వరకు నిర్వహించారు.

అక్కడ జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఎస్ఐ పాల్గొని మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సేవాసంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. పామర్రు మానవత అధ్యక్షులు ఐవీఎస్ మనోహర్ రావు, డైరెక్టర్ కర్రె శ్రీధర్ వితరణతో పేదలకు వస్త్రాలను బహూకరించారు. మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షులు అరిగిల బాలుడు, వైస్ చైర్మన్ బొమ్మారెడ్డి కోటిరెడ్డి, కార్యదర్శి పాముర్తి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటునిస్తాం

ఉయ్యూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు అందించాలని కరూర్ వైశ్యా బ్యాంక్ ఉయ్యూరు బ్రాంచ్ మేనేజర్ బ్రిజేష్‌కుమార్ సింగ్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో 'విద్యతో ఉజ్వల భవిష్యత్' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు బస్‌పాసులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ఆర్టీసీ డీఎం ప్రసాద్, హెచ్‌ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి



ఐనపూరు హైస్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈవో పద్మారాణి

పమిడిముక్కల: పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించాలని గుడివాడ డీవైఈవో ఐ.పద్మారాణి తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఐనపూరు హైస్కూల్‌ను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎం ఎన్‌ఎస్‌కే స్వామి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్న భోజనం పథకం అమలవుతున్న తీరును పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 3 నుంచి 10వ తరగతి వరకు వర్క్‌బుక్స్ చూశారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు.

ఖాతాదారుల ఇంటివద్దకే సేవలు

మండవల్లి: ఇండియన్ బ్యాంక్ డిజిటలైజేషన్ బ్యాంకింగ్‌ను సులభతరం చేసి ఖాతాదారులకు అన్నిరకాల సేలను ఇంటివద్దే అందిస్తోందని మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు పేర్కొన్నారు. మండవల్లి బ్యాంక్‌లో ఇండియన్ బ్యాంక్ ఖాతాదారుల సమావేశం మంగళవారం మేనేజర్ అధ్యక్షతన జరిగింది.

దుర్గారావు మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ డిజిటలైజేషన్ బ్యాంకింగ్ (పేపర్ లెస్)గా మార్పు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఆన్‌లైన్‌లో కొత్త ఖాతా తెరవడం, క్రాప్ రుణాలు పునరుద్ధరించుకోవడం, రెన్యూవల్, వ్యక్తిగత రుణాలు పొందడం, ఇంటి నుంచి నిమిషాల్లో ఆన్‌లైన్ ద్వారా ఎలాంటి హామీలు లేకుండా రుణాలు పొందవచ్చని ఖాతాదారులకు వివరించారు. ఏబీఎం వి.పద్మకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ కె. కవిత, క్యాషియర్ టి.మంగయ్య, కె.అమర్నాథ్, గన్నవరం మాజీ సర్పంచ్ గుడివాడ వీరరాఘవయ్య, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో చీడపీడల నివారణ

మండవల్లి: సరైన సస్యరక్షణ చర్యలతో చీడపీడలను నివారించవచ్చని డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని లింగాలలో వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గౌతమ్‌కుమార్ ఆధ్వర్యానమంగళవారం ప్రకృతి వ్యవసాయ కషాయాలు, వేప పిండి, గ్రోత్ ప్రమోటర్, పసుపు పళ్లాలు, లింగాకర్షక బుట్టలు, పాల ఇంగువ, కంది గింజలతో కూడిన కిట్లు రైతులకు అందించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నాగ విజయ, ఐసీఆర్పీలు జగన్, రమేష్, రామారావు, ఉషారాణి, నళిని, నాగవాణి పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

మచిలీపట్నం టౌన్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి మన్నన పొందాలని విద్యుత్ శాఖ సీఎండీ డి. సుబ్బారావు అన్నారు. నగరంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సుబ్బారావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది వృత్తిపరమైన నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో మచిలీపట్నం డివిజన్ ఈఈ మన్నెం భాస్కరరావు, డీఈ, ఏఈలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



నారాయణపాలెం జగనన్న కాలనీలో బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. కాలనీలో రోడ్డు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. మండలంలో కృష్ణాపురం శివారు నారాయణపురంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. తొలుత గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేశారు. సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాలుగేళ్లగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. పేదల పక్షపాతి సీఎం జగన్ అని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంకి బలుసలమ్మ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీలు మర్రి దుర్గారావు, గుర్విందపల్లి వంశీ, మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు కృష్ణాపురానికి జెడ్పీ చైర్‌పర్సన్

కృష్ణాపురం పంచాయతీ పరిధిలోని గొడపాలెంలో బుధవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్ తెలిపారు. కొత్తగా నిర్మించిన రహదారిని ప్రారంభిస్తారని చెప్పారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



కమిషనర్ మురళీకృష్ణను సత్కరిస్తున్న స్థానికులు

గుడివాడ టౌన్: కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను స్థానికులు మంగళవారం సత్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం లోని ఆయన చాంబర్‌లో విశ్రాంత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాలాది ప్రభాకరరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వేల్పుల నాగబాబు, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి సదర్ల నాగేంద్రరావు, కొడాలి భాగ్యారావు, కె కుమారస్వామి తదితరులు సత్కరించారు. వారు మాట్లాడుతూ 2007లో ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు పొందిన మురళీకృష్ణ తిరిగి గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా రావడం, వచ్చిన ఏడాదిలోపే ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం ఆయన పరిపాలనకు నిదర్శనమన్నారు.

165 మందికి క్యాన్సర్ పరీక్షలు



మొబైల్ వైద్యశాల వద్ద మణిపాల్ హాస్పటల్ టీమ్ సభ్యులతో లయన్స్ క్లబ్ సభ్యులు

పామర్రు: లయన్స్ క్లబ్ ఆఫ్ పామర్రు సౌజన్యంతో విజయవాడ మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్ సేవా భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ పరీక్ష కేంద్రానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 165 మందికి క్యాన్సర్ పరీక్షలు చేశారు. క్యాంపులో మణిపాల్ మొబైల్ వైద్యశాలలో టెక్నికల్ టీమ్ సభ్యుల ఆధ్వర్యాన పరీక్షలు చేశారు. వీటి వివరాలను ఆన్‌లైన్‌లో మణిపాల్ వైద్యశాలకు పంపి వాటి ఫలితాలు రెండు రోజుల్లో తెలియజేస్తారు. అనంతరం మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. దీనికి మహిళల ఆరోగ్య సంరక్షణకు పామర్రు క్లబ్ వైద్య శిబిరాలను నిర్వహించి కృషి చేస్తోందన్నారు. విజయవాడ లయన్స్ విరాట్ క్లబ్ అధ్యక్షులు మేడా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయించుకోవచ్చున్నారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లయన్స్ జిల్లా నేత కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు, కోశాధికారి నవులూరి వీర వెంకయ్య, జిల్లా ప్రతినిధులు బైసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం నిర్ణయించండి

గుడివాడ టౌన్: బందరు, పామర్రు రోడ్లలో ఫ్లై ఓవర్ నిర్మాణం కారణంగా స్థానిక కోతిబొమ్మ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించనుండటంతో దానిని తిరిగి ఏర్పాటు చెయ్యడానికి తగిన స్థలాన్ని మంజూరు చేయాలని దళిత ఐక్యవేదిక నాయకులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జైభీమ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు, కోశాధికారి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.